క్లుప్తంగా

'సుంకేసుల'లో 1.068 టీఎంసీల నీరు



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల జలాశయంలో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు ఆదివారం తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచిపోయిందని, కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లను పంపిణీ చేస్తున్న తోట అనూష

ఓర్వకల్లు : ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచు తోట అనూష అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన జామెట్రీ బాక్స్, గ్రాఫ్ బుక్స్, మ్యాప్ పాయింటింగ్‌లను ఆదివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. జగనన్న అమలు చేసిన విద్యా కానుక, అమ్మ ఒడి పథకాల ద్వారా హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : మండలంలోని వెంకటగిరి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

నేడు చేనేత దినోత్సవం

కోడుమూరురూరల్ : కోడుమూరులో సోమవారం చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎప్సార్‌సీపీ నేత లాయర్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ హాజరవుతారని, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రజలు ప్రశ్నించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: సమస్యలపై పాలకులను ప్రజలు ప్రశ్నించాలని, ఆ విధంగా చైతన్య వంతులు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి సీపీఎం చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారం ఐదో రోజు గూడూరు మండలం కె.నాగలాపురంలో ప్రారంభమై పర్ల, సల్కాపురం మీదుగా పెద్దపాడు వరకు సాగింది. పర్ల గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో కే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం కంకణం కట్టుకుందన్నారు. అనేక మంది పాదయాత్రలు చేశారని, వారి యాత్రకు.. సీపీఎం పాదయాత్రకు తేడా ఉందన్నారు. మిగతా పార్టీలు అధికారం కోసం పాదయాత్రలు చేస్తున్నాయని, సీపీఎం జిల్లా అభివృద్ధి కోసం పాదయాత్ర చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పర్ల గ్రామంలో పూడ్చడానికి శ్మశాన వాటిక లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, నారాయణ, ఆనంద్‌బాబు, అలివేలమ్మ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అ మలు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన ఉపాధ్యాయ సమస్యలపై 12 గంటల పాటు సామూహిక నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం సలాం ఖాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాప్టో జిల్లా కమిటీ సమావేశంలో విడుదల చేశారు.కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మెన్ ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హృదయ రాజు, జిల్లా కమిటీ చైర్మెన్ ఎస్.గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్ప పాల్గొని ప్రసంగించారు. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు జనార్దన్, శేఖర్, నాగరాజు, గోవింద్,నాయక్, దేవదాస్, మారియానందం, సుధాకర్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనకు బాబే కారకుడు

- ఆవేశపూరిత వ్యాఖ్యలతో కార్యకర్తలను రెచ్చగొట్టారు
- పోలీసులపై దాడులు చేయడం సరికాదు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నిరసన



చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నేతలు

కోడుమూరు రూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే చిత్తూరు జిల్లా పుంగనూరులో వివాదం చెలరేగిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆదివారం పుంగనూరు ఘటనను నిరసిస్తూ కోడుమూరులోని కొత్తబస్టాండ్ సర్కిల్లో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలతో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ నిరసన ప్రదర్శన చేపట్టి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు వెళ్లిన ప్రతి చోట టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ అల్లర్లు సృష్టించేలా మాట్లాడుతున్నారన్నారు. ఆయనను చూసి ఆయన కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ కూడా సభల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారు

40ఏళ్ల ఇండ్రస్టీ అని చెప్పుకునే బాబుకు ఎన్నికల భయం పట్టుకుందని, ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై గెలవలేమన్న అక్కసుతో నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను, ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఆయన నిర్వాకం వల్లే పోలీసులపై దాడులు జరిగాయని, పోలీసులపై దాడులు అమానుషకరమని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత మామనే వెన్నుపోటు పొడిచి ఎన్‌టీఆర్ చావుకు కారకుడైన బాబు మళ్లీ ఆ మహానుభావుడి గురించే మాట్లాడుతుడడం దారుణమన్నారు. అధికారం కోసం ఎంతకైనా దిగజారే నరరూపరాక్షసుడు చంద్రబాబు అని, ప్రజలు ఆయన చెప్పే మాయమాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, డైరెక్టర్ ఇమ్మానేయులు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి, లాయర్ ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, బలరాం పాల్గొన్నారు.



చెన్నమ్మ సర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతాం

కల్లూరు: రాబోయ్యే ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుంగనూరులో చంద్రబాబు సృష్టించిన విధ్వంసకాండకు నిరసనగా ఆదివారం చెన్నమ్మ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రబాబు వద్దు ప్రజాస్వామ్యం ముద్దు, చంద్రబాబు వైఖరి నశించాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుంతురెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు వారాహి, యువగళం, సాగునీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. కర్నూలు, నంద్యాలలో ప్రాజెక్టుల సందర్శన పేరుతో నిర్వహించిన సమావేశాలకు ప్రజలు రాక పోవడంతో పులివెందులలో విధ్వంసకాండకు ట్రెలర్ వేసి, పుంగనూరులో సినిమా ప్రదర్శించారని చెప్పారు. ప్రజలకు భద్రతకు రక్షణగా ఉన్న పోలీసులపై టీడీపీ నాయకులు దాడిచేయడం దారుణమన్నారు. అధికార దహంతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబును రాష్ట్రంలోని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్పొరేటర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో విధ్వంసకాండకు కారణమైన చంద్రబాబు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): భూముల రీ సర్వేతో భూ వివాదాలు పూర్తిగా పరిష్కారమవుతాయని, దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కర్నూలు ఆర్డీఓ సి.హరిప్రసాద్ అన్నారు. ఆదివారం కర్నూలు మండలం దిగువపాడు గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలో 21 రెవెన్యూ గ్రామ పంచాయతీల్లో 82,632 ఎకరాల భూమి ఉందన్నారు. భూముల రీ సర్వేతో 17,140 మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఆయా సర్వే నంబర్లలో రీ సర్వే చేసే సమయంలో సంబంధిత రైతులు తప్పకుండా హాజరయ్యేలా చూడాలని తహసీల్దార్ శివరాముడును ఆదేశించారు. రీ సర్వేకు రైతులందరూ సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రీ సర్వే తర్వాత జారీ చేసిన రికార్డులను ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

'స్పందన'తో సమస్యల పరిష్కారం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన'తోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అర్జీలు ఇస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్న స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

'స్పందన'కు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. గైర్హాజరయ్యే అధికారులపై నివేదకలను కలెక్టర్ కార్యాలయానికి పంపి, చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామన్నారు. కాగా మండల కేంద్రం సి.బెళగల్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పించాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో కోరారు. స్థానిక మండల భవిత కేంద్రం ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీ చేయించుకొవాలని విజ్ఞప్తి చేశారు.

భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన యానం

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్త మ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శ నం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సులేఖ రాణికి డాక్టరేట్



కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు వి భాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఎస్. సులేఖ రాణికి డాక్టరేట్ లభించింది. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మ పర్యవేక్షణలో 'అప్రెషన్ అండ్ విక్టిమైజేషన్ ఆఫ్ విమెన్ ఇన్ ది సెలెక్ట్ ప్లేస్ ఆఫ్ విజయ్ టెండూల్కర్ ఏ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆర్‌యూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ విషయాన్ని అవార్డు గ్రహీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మిరప రైతులను నిండా ముంచిన వైరస్

- వైరస్ సోకిన మిరపను గొర్రెలకు వదిలేసిన రైతులు



వైరస్ సోకిన మిరప పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన రైతు షఫీ

కోడుమూరు రూరల్ : మిరప రైతులను వైరస్ నిండా ముంచేసింది. మిరపకు పంటకు వైరస్ సోకి దెబ్బతినడంతో మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రైతులు గొర్రెలకు మేతగా వదిలేస్తున్నారు. అధిక వర్షాల వల్ల తేమ ఎక్కువై మిరపకు వైరస్ సోకడంతో మిరపకాయలు ఎదగకుండా ముడుచుకుపోతున్నాయని చెబుతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా వైరస్ అదుపులోకి రావడం లేదన్నారు. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిరపను గొర్రెలకు మేతగా వదిలేయడంతో పాటు, దున్నేసి ఇతర పంటలు సాగు చేసేందుకు సిద్ధంమవుతున్నట్లు ప్యాలకుర్తికి చెందిన రైతులు షఫి, అబ్దుల్లా, రామాంజినేయులు, రవి, శ్రీరాములు, రంగన్న వాపోయారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



లలితా పీఠంలో ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న బాలికలు

కర్నూలు కల్చరల్: నగరంలో పలువురు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సెయింట్ జోసఫ్ పాఠశాల 1977 బ్యాచ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్ సాధన ఎస్తేర్, వివిధ హోదాల్లో ఉన్న ఆమె స్నేహితులు జయ, అన్నె ప్రతాప్, ప్రమీల, జహనారా, ఫౌజియా, ఫ్లొరెన్స్, యశోద, విమల, రాధ, కోమల తదితరులు కర్నూలు నగర వనంలో కలుసుకుని సరదాగా గడిపారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఓల్డ్ సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో రాఘవేంద్ర స్వామి సేవా సత్సంగం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు వారి స్నేహితులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్‌లు కట్టి సంతోషంగా గడిపారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఈఓ రామకృష్ణకు చెక్కు అందిస్తున్న సురేష్‌కుమార్ కుటుంబ సభ్యులు

పాణ్యం: కొత్తూరు శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదానికి గుంటూరు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న సురేష్‌కుమార్ రూ.1,00,116 చెక్కును ఈఓ రామకృష్ణకు అందించారు. ఆలయ మర్యాదలతో దాతల కుటుంబానికి పూజలు చేయించి శేష వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని

కర్నూలు (టౌన్): కొట్లాడి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. క్రిష్ణనగర్‌లో శ్రీకాంత్(35) కుటుంబం నివసిస్తుంది. ఈయనకు భార్య ఒక కొడుకు, ఒక కుమారుడు ఉన్నారు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్న శ్రీకాంత్ , అతని భార్య ఆదివారం ఉదయం గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆమె అమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటి వాళ్లు గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

గుండెజబ్బులపై అప్రమత్తత అవసరం



డాక్టర్ ఎ.వసంతకుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల పట్ల అప్రమత్తత అవసరమని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో గుండెజబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ. వసంతకుమార్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లో అన్ని వసతులు ఉన్న ఆసుపత్రికి వెళితే కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. గుండెపోటు మరణాలను నివారించేందుకు ప్రస్తుతం ఆధునిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, కార్డియాలజిస్టుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. గుండెజబ్బులకు చికిత్స చేసే వైద్యుల సంఖ్య పెరగడం, వైద్యంపై ఎప్పటికప్పుడు నాలెడ్జ్ అప్‌డేట్ కావడం రోగులకు వరంలా మారిందని చెప్పారు. గుండెజబ్బుల మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న స్టెమి ప్రోగ్రామ్ వల్ల ఇంకా మేలు జరుగుతుందన్నారు. దీనివల్ల గుండెపోటుతో చనిపోయే వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు. స్టెమి ప్రోగ్రామ్‌ను గ్రామీణ ప్రాంతాల్లోని సీహెచ్‌సీల్లోనూ ఏర్పాటు చేయడం ద్వారా చాలా వరకు మరణాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఆయా కేంద్రాల్లో ఖరీదైన ఇంజెక్షన్లు ఇచ్చి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు పంపించడం వల్ల గుండెరోగులకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజలు సైతం గుండెజబ్బులకు దూరంగా ఉండాలని, జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలని, ఆహారంలో నియంత్రణ పాటించాలని చెప్పారు. అనంతరం ఆయనను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, ట్రెజరర్ వెంకటరాముడు సన్మానించారు.





మహాగౌరి అమ్మవారికి హారతి ఇస్తున్న పురోహితులు ,శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో సంకటహర చతుర్థి వ్రతాలు

కర్నూలు కల్చరల్: సంకట హరి చతుర్థిని పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సంకట హర చతుర్థి వ్రతాలు విశేషంగా జరిగాయి. అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞ పూజలు జరిగాయి. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





బూజనూరు గ్రామ సమీపంలో వరి నారును నాటేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు, కొరటమద్ది గ్రామంలో వరి సాగు చేసేందుకు ట్రాక్టర్ తో సిద్ధం చేసుకున్న రైతులు

●జోరుగా ఖరీఫ్ పనులు

ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని పెసరవాయి, బూజనూరు, చిందుకూరు, కొరటమద్ది గ్రామాల్లోని రైతులు వరి నాట్లలో బిజీగా ఉన్నారు. ఇప్పటికే వరి నారును సిద్ధం చేసుకొని నాట్లు వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 32 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో ఖరీఫ్‌లో దాదాపు పదివేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు.

– గడివేముల



కొండారెడ్డి బురుజు దగ్గర అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక

స్మార్ట్ సిటీగా నగరం

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తూ కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వెల్లడించారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద రూ.1.90 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులను కార్పొరేటర్లతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మరో మూడు నెలల వ్యవధిలో కొండారెడ్డిబురుజు పనులు పూర్తి చేస్తామన్నారు. కొండారెడ్డి బురుజు వెనుక పాదాచారులు మాత్రమే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. వాహనాలన్నీ అంబేడ్కర్ సర్కిల్ వైపు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు వద్ద పార్కు, వాటర్ ఫౌంటెన్, చరిత్రకారుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో నగరం రూపు రేఖలు మార్చినట్లు చెప్పారు. ప్రస్తుతం నగరంలోని 52 వార్డుల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బుట్టారేణుక, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారయణమ్మ, ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.